ప్రభుత్వ పాఠశాలకు భవనం కేటాయించాలి

ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్ రెడ్డి, తదితరులు

సైదాబాద్, జూన్ 9 : బడుగు, బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్న సైదాబాద్ డివిజన్ పరిధిలోని గాంధీ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు భవనాన్ని సమకూర్చాలని కోరుతూ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతి పత్రం సమర్పించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన 'ప్రజావాణి'లో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని బి-బ్లాక్స్ ప్రభుత్వ ఉద్యోగుల గృహ సముదాయంలో గల 56, 57 క్వార్టర్స్‌ని గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కేటాయించాలని కోరారు. అనేక ప్రాంతాలకు చెందిన పేద ప్రజల చిన్నారులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారని, అయితే అందుకు అనుకూలంగా పాఠశాలల్లో తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు తరగతి గదులు లేకపోవడంతో కలుగుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తక్షణమే ఖాళీగా ఉన్న ప్రభుత్వం క్వార్టర్స్‌ను కేటాయించాలని ఆమె విద్యాశాఖ అధికారులను కోరారు. క్వార్టర్స్‌లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజారాం, దిలీప్, చందర్ గౌడ్ పాల్గొన్నారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు

కందుకూరు, జూన్ 9: చిన్ననాటి స్నేహితురాలికి మిత్రులు ఆర్థిక సాయం చేశారు. మండల పరిధిలోని గూడూరు గ్రామం లో ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో 2004 – 2005 విద్యా సంవత్సరంలో కలిసి చదువుకున్న కటికపల్లి గ్రామానికి చెందిన కరుణ భర్త దేవేందర్ గౌడ్ ఇటీవల మరణించగా ఆమెతోపాటు చదువుకున్న పూర్వ విద్యార్థులు చెయ్యి చెయ్యి కలిసి ఎవరికి తోచిన విధంగా వారు రూ. 35,500లు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పిల్లల చదువు కోసం కలిసికట్టుగా చేదోడువాదోడు ఉంటామని, అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గూడూరు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులను

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

కందుకూరు, జూన్ 9: ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్న వారందరినీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్ రెడ్డి, మండల కో ఆర్డినేటర్ అబ్జల్ బేగ్ కోరారు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి వారు సోమవారం వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం మాట్లాడుతూ, గతంలో నేదునూరు గ్రామంలో సుమారు 1,500 కుటుంబాలు ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకోగా, అందులో 339 కుటుంబాల దరఖాస్తులు ఆన్‌లైన్ నమోదు చేయలేదని, దీంతో వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 200వందల యూనిట్స్ వరకు ఉచిత విద్యుత్, రూ .500 లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు ఇలా అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని, అందువల్ల వారందరి కుటుంబ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు .కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ సాదా పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంకగల్ల పుష్ప దర్శన్, మైనారిటీ నాయకులు ఎండీ అజరుద్దీన్, ఎండీ పర్వేజ్ పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ప్రభాకర్ రెడ్డి, అఫ్జల్ బేగ్

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న ఓయూ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీలలో పీహెచ్‌డీ ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను అధికారులు సోమవారం విడుదల చేశారు. ఓయూలో కేటగిరి 2 ద్వారా పీహెచ్‌డీ ప్రవేశాలకు ఏప్రిల్ 25 నుంచి 27 వరకు కంప్యూటర్ ఆధారిత ప్రవేశపరీక్షలను వర్సిటీ నిర్వహించింది. మొత్తం 49 విభాగాల్లో ప్రవేశాలు పొందేందుకు 9,747 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 7,907 మంది పరీక్షలకు హాజరు కాగా, ఉత్తీర్ణత శాతం 62.60గా నమోదయింది. ఈ సందర్భంగా ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. విభాగాల వారీగా అభ్యర్థుల ర్యాంకు కార్డులను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఈనెల 23 నుంచి పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్స్ ప్రొఫెసర్ జలపతి, డాక్టర్ అక్తర్ అలీ, డాక్టర్ కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ట్రంకులైన్ పనులను పునరుద్ధరించండి

మన్సూరాబాద్, జూన్ 9: మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ పరిధి ప్రాంతంలోని పలు కాలనీలలో నిలిచిపోయిన ట్రంకు లైన్ పనులను వెంటనే పునరుద్ధరించాలని డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి కోరారు. జలమండలి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి డివిజన్ పరిధిలోని పలు సమస్యలను జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, సుమారు 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన యూజీడీ వ్యవస్థ వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయని.. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త లైన్లను ఏర్పాటు చేయాలని అన్నారు. పద్మావతి కాలనీ, చండీశ్వర్ కాలనీ, చిత్ర సినిమా కాలనీ, రాజేశ్వరి పవిత్ర కాలనీలలో నెలకొన్న మ్యాన్ హోల్స్, తాగునీటి సరఫరా, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ రాజు, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో నెలకొన్న సమస్యలను జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డికి వివరిస్తున్న కార్పొరేటర్

పూడికతీత పనులు ప్రారంభం

సిబ్బందితో మ్యాన్‌హోల్స్ క్లీన్ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ సరస్వతి, తదితరులు

బడంగ్ పేట్, జూన్ 9: వర్షాకాలంలో వరద నీరు సజావుగా పోవడానికి వరదనీటి కాల్వలను క్లీన్ చేయిస్తున్నట్లు కమిషనర్ సరస్వతి తెలిపారు. వందరోజుల ప్రణాళికలలో భాగంగా బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్లో నాలాల పూడికతీత, మ్యాన్‌హోల్స్ క్లీన్ చేయడం, గల్ఫర్తో పొంగుతున్న డ్రైనేజీలను క్లియర్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32 డివిజన్లలో ఉన్న సమస్యలను వంద రోజులలో ప్రణాళిక బద్ధంగా పనిచేయడం జరుగుతుందన్నారు. ప్రతి కాలనీలో ఉన్న సమస్యలను తెలుసుకొని దశలవారీగా వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అన్ని విభాగాల అధికారులు 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్యాంసుందర్, డీఈ వెంకన్న, ఆర్ఓ వేణుగోపాల్ రెడ్డి, మేనేజర్ నాగేశ్వరరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రతిభా పురస్కారాలు అందుకొన్న విద్యార్థులతో శ్రీత్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ కర్ర గోవర్ధన్ రెడ్డి, తదితరులు

సైదాబాద్, జూన్ 9 : విద్యలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను ప్రోత్సహించటమే తమ సంకల్పమని శ్రీత్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ కర్ర గోవర్ధన్ రెడ్డి అన్నారు. శ్రీత్రివేణి విద్యా సంస్థల స్కూల్ అచీవర్స్ డే వేడుకల్లో విద్యలో అత్యుత్తమంగా రాణించిన విద్యార్థులకు నగదు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పదవ తరగతి వార్షిక పరీక్షల్లో జయహంసినీ 600/589, ఆదిల్ 600/587 మార్కులను సాధించిన ఇద్దరికి 35 వేల రూపాయల చొప్పున, ఉత్తమ ప్రతిభ కనబర్చిన నీతూ సింహా, మనస్వీ, హర్షిణి రెడ్డి, హష్మత్ జిషాన్‌లకు 25 వేల రూపాలయ చొప్పున, ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులకు 4లక్షల 45 వేల విలువైన నగదు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేసి, అభినందించారు. రెండు పాఠశాలల్లో మొదటి తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రతి క్లాస్ నుండి విద్యలో అత్యద్భుతమైన ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆరు లక్షల రూపాయల మెరిట్ స్కాలర్స్ షిప్‌లు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.వి.ఎన్. రాజు, డాక్టర్ వనజ, చైర్మన్ జిట్టా సురేందర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పదిమందికిపైగా గాయాలు

విద్యుత్ నిలిచిపోవడంతో తప్పిన పెను ప్రమాదం

ప్రమాదంలో గాయాలైన వ్యక్తులు

కందుకూరు,జూన్ 9 : హైదరాబాద్–శ్రీశైలం రహదారి కొత్తగూడ గేటు వద్ద సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సు బైక్ ను ఢీ కొట్టిన సంఘటనలో పదిమందికిపైగా గాయాలు కాగా పలువురి పరిస్థితి విషమంగా ఉంది. అయితే ఈ సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. మండల పరిధిలోని జైత్వారం గ్రామానికి చెందిన సంగెం శ్రీశైలం బైక్‌పై తన భార్య శ్రీలత, కొడుకు ప్రణీత్ కుమార్‌తో కందుకూర్ క్రాస్ రోడ్డు నుండి శ్రీశైలం–హైదరాబాద్ రహదారి పై జైత్వారం గ్రామానికి వెళ్తున్నాడు. మార్గ మధ్యలో కొత్తగూడ గేటు వద్ద జైత్వారం వెళ్ళే రోడ్డుకి కుడివైపుకి మరలగా, అదే సమయములో శ్రీశైలం హైవేపై కడ్తాల నుండి హైదరాబాద్‌కు వస్తున్న అచ్చంపేట డిపో కి చెందిన సూపర్ లగ్జరీ బస్ అతి వేగంగా, అజాగ్రత్తగా వచ్చి బైక్‌ని ఢీ కొట్టి తరువాత పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను, కరెంట్ పోల్‌ని బలంగా తాకింది. ఈ ప్రమాదములో బైక్ పై ఉన్నవారితో పాటు, బస్‌లో ఉన్నవారు సుమారు 10 మందికి గాయాలయ్యాయి. వీరిలో బైక్‌పై ఉన్న శ్రీశైలంతోపాటు ఆయన భార్య శ్రీలత, కుమారుడు ప్రణీత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. కందుకూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిన పెను ప్రమాదం...

ఈ సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టగా పెద్ద శబ్దంతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోయాయి. ఈ సమయంలో విద్యుత్ వైర్లు తెగి రోడ్డుపై పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు ఉన్నట్లయితే ఆర్టీసీ బస్సుతో పాటు అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు విద్యుత్ షాక్‌కు గురయ్యేవారు. దీంతో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్ పునరుద్ధరణ...

ఈ ప్రమాదంతో విద్యుత్ నిలిచిపోవడంతో విద్యుత్ అధికారులు విద్యుత్తును పునరుద్ధరించారు. ఏఈ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది రోజంతా కష్టపడి ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలను అమర్చారు. సాయంత్రం వరకు విద్యుత్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడవలసి వచ్చింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జూన్ 9: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘ డ్ సబ్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో మంగళ వారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అస్మాన్ ఘడ్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆనంద్ బిస్కెట్ ఫ్యాక్టరీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి12 గంటల వరకు, 11కేవీ లక్ష్మీ నగర్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఆయా ఫీడర్ల ప్రాంతాలతో పాటు పరిసర ప్రాం తాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పాత బస్తీలో పూడికతీత పనులు చేపట్టాలి

మాదన్నపేట, జూన్ 9: పాతబస్తీ కుర్మగూడ డివిజన్‌లో పూడికతీత పనులు త్వరగా పూర్తి చేయాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ యాదవ్ అధికారులను కోరారు. పాతబస్తీలో మురికి నీళ్లు ప్రవహిస్తుడడంతో సోమవారం ఆయన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం సమీపిస్తున్నా పాతబస్తీలో ఇప్పటి వరకు పూడికతీత పనులు మొదలు పెట్టలేదని, ఆయన అధికారుల పనితీరు పై మండిపడ్డారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు. నాయకులు తంగెళ్ల సుధీర్, మోహన్ లడ్డు, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం

రెవెన్యూ సదసులో వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు రవి, తదితరులు

బడంగ్‌పేట్, జూన్ 9: ఇందిరమ్మ రాజ్యంలోనే బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా నాయకుడు బుర్ర రవి మాదిగ ఆరోపించారు. ఇందిరమ్మ పేరు మీద ఇచ్చిన పట్టాలకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బాలాపూర్ 74 సర్వే నెంబర్లలో గతంలో ఇచ్చిన ఇందిరమ్మ పట్టాల లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ బాలాపూర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, ఆర్ఐ జమీల్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో 74 సర్వేనెంబర్‌లో మాదిగలు దునుకున్నటువంటి భూమిని ఏఆర్‌సీఐ కొంత భాగం తీసుకోగా మిగతా భాగంలో పట్టాలివ్వడం జరిగిందన్నారు. గతంలో ఆర్థిక పరిస్థితుల వల్ల దళితులు ఇల్లు కట్టుకోలేకపోయారన్నారు. ఈ విషయాన్ని గతంలో అనేకమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. బాలాపూర్‌లో ఉన్న మాదిగలకు అన్యాయం జరుగుతూఉంటే కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ రాజ్యం అందరికీ న్యాయం జరుగుతుందని ఎలా చెబుతారన్నారు. కాంగ్రెస్ బడా నాయకులు మోసం చేస్తున్నారన్నారు. బాలాపూర్‌లో అన్యాయం జరుగుతుంటే కాంగ్రెస్ నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ అధికార ప్రతినిధి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మస్కూరి సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఖనిజాలను వెలికి తీసే ప్రక్రియలో జీఎస్ఐ ప్రముఖ పాత్ర

సిటీ బ్యూరో, జూన్ 9: జాతీయ అభివృద్ధి కోసం కీలకమైన ఖనిజాలను వెలికి తీసే ప్రక్రియలో దేశం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ఎల్బీనగర్, నాగోల్, బండ్లగూడ జీఎస్ఐ ప్రాంగణంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన 'నెక్ట్స్ జనరేషన్ జియో ఫిజిక్స్ – 2025' సదస్సుకు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ తో కలిసి అధునాతన హైడ్రాలిక్ డ్రిల్లింగ్ రిగ్ లను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎక్స్పో పెవిలియన్ ప్రారంభించి ఎగ్జిబిషన్ స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, జి–7, జి–20 వంటి ప్రపంచ వేదికలలో భారతదేశం యొక్క ఆధిపత్యం రోజురోజుకు పెరుగుతోందన్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా 175 సంవత్సరాలుగా దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అయిందన్నారు. భూ ఖనిజాలను వెలికి తీయడంతో పాటు అవసరమైన వనరుల అన్వేషణలో జీఎస్ఐ ఎంతో ప్రముఖ పాత్ర వహిస్తోందన్నారు. ఎంపీ మాట్లాడుతూ, జియో హజార్డ్ అసైన్మెంట్, మినరల్ ఇన్వెస్టిగేషన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ను అభివృద్ధి చేయడానికి జీఎస్ఐ స్వీకరించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఐటీఐ డిప్యూటీ డైరెక్టర్, హెడ్ మిషన్ –వి డాక్టర్ ఎస్. రవి, జీఎస్ఐ డైరెక్టర్ జనరల్, కాన్ఫరెన్స్ చీఫ్ అసిత్ సాహ, తెలంగాణ రాష్ట్ర విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎల్‌పీ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఐ ఉద్యోగుల సమస్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఆల్ ఇండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

జీఎస్ఐ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

సదస్సుకు హాజరైన కేంద్రమంత్రికి పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్ టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఆల్ ఇండియా సదరన్ రీజియన్ జీఎస్ఐ ఎస్సీ, ఎస్టి వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆధర్ల మహేష్, రీజినల్ సెక్రటరీ జి. రాజశేఖర్ ఆధ్వర్యంలో సమస్యలను వివరించారు. జీఎస్ఐలో ఉద్యోగుల సంఖ్యను పెంచాలని, జీఎస్ఐ ఆడిటోరియాన్ని పునర్మించాలని, లిఫ్టులను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జీఎస్ఐ డైరెక్టర్ జనరల్‌కు కేంద్ర మంత్రి ఈ సందర్భంగా సూచించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీజీబీ అజయ్ కుమార్, జీఎస్ ఐ ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ చెన్నై వైస్ చైర్మన్ ఎం. సోమ శ్రీనివాసులు, అసిస్టెంట్ రీజినల్ సెక్రటరీలు ఏ. మేఘరాజ్, కె. సునీల్ కుమార్, బి. ప్రభాకర్, ఏ. శంకర్, కోశాధికారి బి. ఆనంద్ కుమార్, సభ్యులు చంద్రయ్య, శ్రీనివాసరావు, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి

బడంగ్ పేట్, జూన్ 9: ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందేల శ్రీరాములు ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలను గుర్తించి, ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్న మదర్సాలను తొలగించాలని ఆయన కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, అక్రమంగా నోట్ బుక్స్, యూనిఫామ్ లు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ గడ్డం లక్ష్మా రెడ్డి, సీనియర్ నాయకులు ఏనుగు ప్రభాకర్ రెడ్డి, జక్కిడి మధుసూదన్ రెడ్డి, ఎల్చల భాస్కర్ రెడ్డి, నిమ్మల రవికాంత్ గౌడ్, సురేందర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

బాక్స్ డ్రైన్ నిర్మాణానికి నిధులు మంజూరు

సైదాబాద్, జూన్ 9: కృష్ణానగర్ కాలనీలోని వరద నీటి కాలువను ఎస్ఎన్‌డీపీ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఐ ఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత పరిశీలించారు. డివిజన్ పరిధిలోని జేఎస్ రెడ్డి స్విమ్మింగ్ పూల్ బాలాజీ నగర్ నుండి కృష్ణ నగర్ కాలనీ వరకు వరద నీటి కాలువను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, స్థానిక వరద నీటి కాలువకోసం బాక్స్ నాలా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. పనులను త్వరితగతిన చేపట్టి సకాలంలో పూర్తి పూర్తి చేసి స్థానికులకు వరద నీటి ఇబ్బందులను తొలగించాలని కోరారు.

బాక్స్ నాలా అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను కాలనీవాసులతో అధికారులు చర్చించి తను సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ నాలా ప్రాజెక్ట్ అధికారులు ఈఈ రోహిణి, డీఈ ఉమామహేశ్వరి, ఏఈ భరత్, వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ జీఎం బలరాం రాజు, డీజీఎం సన్యాసి రావు, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఏఈ శిరీష, భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగ మధుకర్ రెడ్డి, కాలనీ కమిటీ సభ్యులు జైపాల్ రెడ్డి, యాదయ్య, మల్లేష్, సుష్మ, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానగర్ కాలనీలో వరద నీటి కాలువను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్వేత, వివిధ శాఖల అధికారులు

కాలనీల్లో అంతర్గత రోడ్లకు అధిక ప్రాధాన్యత

కాలనీలలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత అన్నారు. డివిజన్ పరిధిలోని కోదండరాం నగర్ కాలనీలో 8 లక్షల 50 వేల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆమె పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, అదే విధంగా కాలనీవాసుల సూచనలు మేరకు పనులు చేయాలన్నారు. అన్ని కాలనీలో అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి, ఇంజనీరింగ్ ఏఈ శిరీష, కాలనీ సభ్యులు జంగారెడ్డి, సురేష్, రంగా రావు, సురేష్, వెంకటేష్, పాండు, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదు

వక్క లంక శ్రీనివాసరావు

ఆర్కే పురం, జూన్ 9: చట్టాలను ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య తెలంగాణ ప్రాంతీయ కార్యదర్శి వక్క లంక శ్రీనివాసరావు హెచ్చరించారు. సరే రీజన్ డాక్టర్స్ కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణులను కానీ, ఇతర కులాలను కానీ, మతాలను కానీ కించపరిస్తే ఊరుకోమని హెచ్చరించారు. మంచు మోహన్ బాబు కుటుంబం బ్రాహ్మణ జాతి పై పగ బట్టింది అనే బాధ బ్రాహ్మణులలో నెలకొని ఉందని శ్రీనివాస్ రావు అన్నారు. గతంలో 'దేనికైనా రెడీ' అనే సినిమాలో బ్రాహ్మణులను కించపరిచే సన్నివేశాలు చిత్రించడమే కాకుండా బ్రాహ్మణులపై భౌతిక దాడులకు పాల్పడిన సంఘటనలు, సంబంధిత బ్రాహ్మణులను ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించిన సంఘటనలు జరిగాయని, తాజాగా 'కన్నప్ప' అనే సినిమాలో 'పిలక, గిలక' అనే రెండు పాత్రలను రూపొందించి చిత్రించి బ్రాహ్మణులను కించపరిచారని, అసలు విషయం ఏమిటంటే మంచు మోహన్ బాబు కుటుంబం చట్టాలను ఉల్లంఘించిందని, 'కన్నప్ప' సినిమాపై కోర్టులో కేసు ఉండగానే ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించడం చట్టాలను ఉల్లంఘించడం కాదా? అని ప్రశ్నించారు. వృత్తిపరంగా బ్రాహ్మణులనే కాదు ఏ కులం వారినైనా కించపరిచే విధంగా సన్నివేశాలను చిత్రీకరించడం ఫ్యాషన్‌గా మారిందని, తక్షణమే మోహన్ బాబు కుటుంబం యావత్ మానవ జాతికి క్షమాపణ చెప్పి 'కన్నప్ప' సినిమాలో ఉన్న 'పిలక, గిలక' సన్నివేశాలను తొలగించాలని శ్రీనివాసరావు కోరారు. ఇందుకోసం న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మానవులుగా జన్మించిన మనం, మానవత్వంతో వ్యవహరించాలని, సమాజంలో కులాలు, మతాలు వేరైనా దేవుడు ఒక్కడే అనే నానుడిని మంచు కుటుంబం గుర్తుపెట్టుకుంటే మంచిదని శ్రీనివాసరావు హెచ్చరించారు.